సాక్షి తిరుపతి
బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోమారు గెలిపిస్తాయని తిరుపతి ఎమ్మెల్యే భూమన అన్నారు. - 8లో



జనసేన కోడ్ ఉల్లంఘన

శ్రీకాళహస్తిలో జనసేన నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ వృద్ధులకు డబ్బు, నిత్యావసరాలు అందజేశారు. - 8లో



న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బదిలీ

– ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీకి బాధ్యతలు



జి.లక్ష్మీశ, కలెక్టర్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా రెండో కలెక్టర్‌గా జీ.లక్ష్మీశ ఈ ఏడాది జనవరి 31వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆయన్ని బదిలీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన ఎన్నికల కమిషన్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంది. జిల్లాకు కొత్త కలెక్టర్ రేపో మాపో వస్తారనే చర్చ జరుగుతోంది. జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధాన్యచంద్రకు ఇన్‌చార్జ్ కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు.

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన పీజీ మొదటి సంవత్సరం ఎంఏ హిందీ, ఫిలాసఫీ, ఎమ్మెస్సీ బోటనీ, కంప్యూటర్ సైన్స్, ఆంత్రోపాలజీ రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగానికి 3వ తేదీ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు జరిగిన బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల కారణంగా తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణతో సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఇందులో భాగంగా 4న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని 3న అష్టోత్తర శతకలశాభిషేకం, 4న తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసిందని జేఈఓ పేర్కొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ బుధవారం మధ్యాహ్నం నుంచి ఆయా సచివాలయాల్లో పంపిణీ చేస్తారని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. అయితే దివ్యాంగులు, తీవ్ర వ్యాధిగ్రస్తులు, మంచానికి లేదా చక్రాల కుర్చీకే పరిమితమైన వారికి, నడవలేని వయోవృద్ధులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్ అందజేయాలని తెలియజేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



ఏ.రంగంపేట జెడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

చంద్రగిరి: ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆయన మంగళవారం చంద్రగిరి, తిరుచానూరులోని మండల పరిధిలోని ఎ.రంగంపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను 111, 112, 113, 114, తొండవాడ గ్రామం ఎంపీయూపీ స్కూల్‌లోని 130, 131, అంగన్‌వాడీ కేంద్రంలోని 132 కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల రేడియస్ పరిధిలో మార్కింగ్‌ను చెక్ చేసి రెడ్ కలర్‌లో 100 మీటర్ అని తెలిసేలా స్పష్టంగా రాయాలని అధికారులకు సూచించారు. తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 20 పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ పరిశీలించి ర్యాంపు సక్రమంగా ఏర్పాటు చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిరుపతి నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ మారుతి, మహబూబ్ చాంద్, సెక్టార్ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

జైత్రయాత్రకు నీరాజనం



చౌడేపల్లె : సీఎం వైఎస్ జగన్ రోడ్ షోకు విచ్చేసిన జన సందోహం

బోయకొండ క్రాస్ వద్ద ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం

వైఎస్సార్‌సీపీ పూరించిన ఎన్నికల శంఖారావం దశదిశలా మార్మోగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు ప్రజానీకం నీరాజనం పడుతోంది. మేమంతా సిద్ధం అంటూ జేజేలు పలుకుతోంది. మంగళవారం ఈ మేరకు మదనపల్లెలో సభ ముగించుకుని జిల్లాలో అడుగుపెట్టిన జగనన్నకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. సంక్షేమ ప్రదాతపై వెల్లువెత్తిన అభిమానం పూలవర్షమై కురిసింది. పుంగనూరు నియోజకవర్గంలో ప్రారంభించిన రోడ్ షోకు అశేష జనసందోహం తరలివచ్చింది. జయహో జగన్ నినాదాల నడుమ ఉద్వేగంగా అమ్మగారిపల్లెలోని రాత్రి బస కేంద్రం వరకు యాత్ర కొనసాగింది.

- చౌడేపల్లి, సోమలలో సీఎం వైఎస్ జగన్ రోడ్ షో
- మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అడుగడుగునా అపూర్వ స్వాగతం
- సదుం మండలం అమ్మగారిపల్లెలో రాత్రి బస చేయనున్న ముఖ్యమంత్రి
- నేడు పూతలపట్టులో బహిరంగ సభ
- రాత్రికి తిరుపతి జిల్లా రేణిగుంటలో బస

సాక్షి, చిత్తూరు : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బస్సు యాత్ర ముగించుకున్న అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటలకు పుంగనూరు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. చౌడేపల్లి మండలం కృష్ణాపురం వద్ద ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి బోయకొండ క్రాస్ మీదుగా సదుం మండలంలోని అమ్మగారిపల్లె వరకు బస్సు యాత్ర జన నీరాజనాల మధ్య సాగింది.

చౌడేపల్లె, సోమలలో రోడ్‌షో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుంగనూరు నియోజవర్గ ప్రజలు అపూర్వంగా స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. బోయకొండ క్రాస్ వద్ద జగన్ బస్సు దిగి ప్రజలతో మమేకమయ్యారు. మంగళవారం రాత్రి 9.15 గంటలకు సీఎం జగన్ రోడ్ షో చౌడేపల్లెకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బస్సు పైకి వచ్చి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం చెన్నపట్నం డ్యామ్, చెన్నావారిపల్లె క్రాస్, ఇరికిపెంట గ్రామాల మీదుగా సోమల చేరుకుని రోడ్ షో నిర్వహించారు. వేలాదిగా మహిళలు, యువత ముఖ్యమంత్రిపై పూలవర్షం కురిపించారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేస్తుండగా బస్సు ముందుకు కదిలింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో కలసి ప్రజలను ఎక్కడికక్కడ పలకరిస్తూ యాత్రను కొనసాగించారు.



చౌడేపల్లె : ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, పక్కన మంత్రి పెద్దిరెడ్డి



స్వాగతం పలుకుతున్న ఆడపడుచులు

సీఎం సార్.. మళ్లీ మీరే రావాలి

సీఎం సార్.. మీ పాలన మరువలేనిది.. మళ్లీ మీరే రావాలి.. అంటూ జనం నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా పెద్దసంఖ్యలో బారులు తీరిన ప్రజలు తమ అభిమాన నేతను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

నృత్యంతో స్వాగతం

సీఎం వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో షికారీలు నృత్యం చేస్తూ వినూత్నంగా స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో తమ బతుకులను మార్చారని నినాదాలు చేశారు. పక్షిరాజపురం వద్ద షికారీలకు జగనన్న అభివాదం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు.

మహిళలు, యువతే అధికం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు మహిళలు, యువత అధికంగా తరలివచ్చారు. జగన్‌ను చూసేందుకు సాయంత్రం నుంచే జనం తండోపతండాలుగా రోడ్లకు ఇరువైపులా బారులు తీరారు. పల్లెపల్లెలో జగనన్నకు నీరాజనాలు పట్టారు.

మేము సైతం అంటూ మైనారిటీలు

పెద్దూరు క్రాస్‌తోపాటు అనేక ప్రాంతాల్లో ముస్లిం మైనారిటీలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ అభిమాన నేతను చూస్తూ.. సీఎం సాబ్..సీఎం సాబ్.. అంటూ అభిమానం చాటుకున్నారు. ముఖ్యమంత్రి సైతం ముకుళిత హస్తాలతో వారిని పలకరించారు. అక్కడి నుంచి సందూరు క్రాస్, సూరయ్యగారిపల్లె క్రాస్, ఊటుపల్లె క్రాస్, అగ్రహారం క్రాస్, గొంగివారిపల్లె మీదుగా అమ్మగారిపల్లె బస కేంద్రం వద్దకు చేరుకున్నారు. బస్సులో ముఖ్యమంత్రి వెంట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఉన్నారు.



అన్నతో కరచాలనానికి పోటీ పడుతూ..



ఆనందోత్సాహం ఉప్పొంగి..

నేటి యాత్ర ఇలా...

సాక్షి,చిత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం బస్సుయాత్ర ఏడోరోజు బుధవారం చిత్తూరు, తిరుపతి జిల్లాలో సాగనుంది. ఉదయం 9 గంటలకు పుంగనూరు నియోజకవర్గం అమ్మగారి పల్లె నుంచి సీఎం జగన్ బయలుదేరి సదుం, కల్లూరు, దామలచెరువు, తలుపులపల్లె మీదుగా తేనెపల్లె చేరుకుంటారు. భోజన విరామం తర్వాత పూతలపట్టు జాతీయ రహదారి సమీపంలో మేమంతా సిద్ధం పేరిట ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత రంగంపేట క్రాస్ నుంచి తిరుపతి జిల్లాలోని గొల్లపల్లి, గాదంకి, కొంగరవారిపాళెం, మామండూరు మీదుగా రేణిగుంట సమీపంలో రాత్రి బస కేంద్రానికి చేరుకుంటారు.



సోమల : ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సోమల : ప్రియతమ నేతను చూసేందుకు అంతస్తులు ఎక్కిన అభిమానం



అండగా ఉంటా.. అవ్వలకు అభయం

జనం మెచ్చిన నాయకుడి రాక కోసం..

- నేడు పాకలలో ముఖ్యమంత్రి జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- జననేత జగన్‌కు భారీ స్వాగతం పలికేందుకు జాతీయ రహదారిపై తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరణ
- దగ్గర ఉండి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: సంక్షేమ పథకాల ప్రదాత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా నేడు బస్సు యాత్ర నియోజవర్గంలోని పాకాల మండలంలో సాగనుంది. ముందుగా చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మండల పరిధిలోని పదిపుట్లబైలు నుంచి ఈ యాత్ర కొనసాగనుంది. అక్కడ నుంచి పేరసానిపల్లి మీదుగా ఈ యాత్ర సుమారు ఉదయం 11 గంటల ప్రాంతంలో దామలచెరువుకు చేరుకోనుంది.



స్వాగత ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

వాహనాల దారి మళ్లింపు

సీఎం జగన్ పర్యటన పాకల మండలంలోని పదిపుట్లబైలు గ్రామంలో ఉండడంతో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భారీ వాహనాలను రాకుండా దారి మళ్లించినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు.

భారీ ఏర్పాట్లు..

ముఖ్యమంత్రి జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర బుధవారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని పదిపుట్లబైలులో ప్రారంభం కానుంది. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దగ్గర ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలోకి బస్సు యాత్ర ప్రవేశించగానే భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు పదిపుట్లబైలు నుంచి దామలచెరువు వరకు భారీ ఫ్లెక్సీలు, తోరణాలు, పార్టీ జెండాలను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. జనంతో పాటు వాహనాలు కూడా అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో పదిపుట్లబైలు నుంచి దామలచెరువు వరకు హైవేపై ఉన్న గ్రామాల వద్ద పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. పాకాల మండలం దాటగానే పూతలపట్టు మండలంలో సిద్ధం బహిరంగ సమావేశం ముగుస్తుంది. అనంతర తిరిగి పాకాల మండల పరిధిలోని గాదంకి టోల్‌ప్లాజా వద్ద జనం నిలబడి సీఎం జగన్‌ను చూసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, పొలిటికల్ ఇన్‌చార్జ్ పులికేశవ మూర్తిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, స్టేట్ బీసీ కార్పోరేషన్ డైరెక్టర్ రఘుపతి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, నాయకులు రహీం, వినాయక, పవన్‌కుమార్, మధు, రామ్మూర్తి, శ్రీనివాసులు, నరేష్, హరీష్, గౌతమ్, విక్రమ్, అల్తాఫ్, లోకేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కోడ్ ఉల్లంఘన


వృద్ధులకు సరుకులు, డబ్బు అందజేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత కూడా పలు పార్టీలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. అందులో శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగరం వినూత ఆదేశాల మేరకు తొట్టంబేడు మండలంలో ఇద్దరు వృద్ధులకు, విశాలాక్షినగర్‌కు చెందిన ఓ వృద్ధురాలికి నిత్యావసర సరుకులు, డబ్బులు అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఇలాంటివి చేయకూడదన్న నిబంధన ఉన్నా జనసేన నాయకులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్నిమాపక శాఖకు పరికరాల వితరణ


పరికరాలను అందజేస్తున్న గ్రీన్‌టెక్ పరిశ్రమ ఎండీ

నాయుడుపేటటౌన్: తిరుపతి జిల్లా అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జె.రమణయ్య వినతి మేరకు ఆ శాఖకు సంబంధించి సుమారు రూ.16 లక్షల విలువ చేసే పరికరాలను గ్రీన్‌టెక్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు మంగళవారం అందించారు. మేనకూరు సెజ్ పరిధిలోని కోనేటి రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్‌టెక్ పరిశ్రమ వద్ద ఎండీ చంగ్‌చిన్‌చేన్ చేతుల మీదుగా పరికరాలను డీఎఫ్‌ఓ రమణయ్యకు అందజేశారు. అందులో 5 ప్లాస్టిక్ బోట్లు, 50 లైఫ్ రింగ్‌లు, 50 హెల్మెట్లు, 50 లైఫ్ జాకెట్‌లను అందించినట్లు డీఎఫ్‌ఓ వివరించారు. గ్రీన్‌టెక్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి సంక్షేమ కార్యక్రమాలకు తమవంతుగా చేయూత అందించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ జయరామ్, హెచ్‌ఆర్ పీఆర్‌ఓ పవన్, నాయుడుపేట, గూడూరు అగ్నిమాపక శాఖ అధికారులు శ్యామ్‌బాబు, చలమయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నచ్చి ప్రతిపక్ష పార్టీ నేతలు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వలసలు వస్తున్నట్లు ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని బాలాయపల్లి మండలం వెంగమాంబపురంలో టీడీపీకి చెందిన ప్రముఖ వైద్యులు నాగం శేషమనాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న గురవయ్య, వెంకటరమణయ్య వారి అనుచరులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. వచ్చే ఎన్నికలు చాలా కీలకమని ఈ మేరకు వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామ్‌కుమార్‌రెడ్డి వారిని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, నాయకులు పల్లిపాటి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కక్షగట్టి.. కడుపుగొట్టి!

- వలంటీర్లు పింఛన్ బట్వాడా చేయకూడదని కోర్టులో స్టే తెప్పించిన చంద్రబాబు ద్వయం
- ఆ మేరకు సచివాలయాల వద్దే పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలు
- మా ఉసురు తగులుతుందంటూ వృద్ధుల శాపనార్థాలు



ఇన్నాళ్లూ ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇస్తుండడంతో ఏ చీకూ చింత లేకుండా ఆనందంగా ఉన్న ఆ వృద్ధ మోముల్లో భయాందోళన కనిపిస్తోంది. ఏళ్ల తరబడి మంచాన పడిన వృద్ధులు.. నా అనే వాళ్లు లేక సీఎం జగనే మా పాలిట దేవుడు అని పింఛన్‌పైనే ఆధారపడి బతుకుబండి వెళ్లదీసే అభాగ్యులు.. ఆ పింఛన్ డబ్బుతోనే మందుబిళ్లలు, కూడు, గుడ్డ తెచ్చుకుని బతుకీడుస్తున్న వారి పాలిట చంద్రబాబు దారుణంగా వ్యవహరించారు. వలంటీర్లు పింఛన్లు పంచకూడదని చంద్రబాబు తన అనుయాయులతో కోర్టుకు వెళ్లి స్టే తెప్పించడంలో సక్సెస్ అయ్యాడేమో కానీ మా శాపనార్థాలు చంద్రబాబుకు తప్పక తగులుతాయని పండుటాకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– చంద్రగిరి/తిరుపతి సిటీ/రేణిగుంట/ పిచ్చాటూరు

లేవలేని స్థితిలో పింఛను కోసం ..



నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వా పింఛను ఇదిగో అంటూ ఇచ్చేవాడు. 91 సంవత్సరం మీద పడడంతో నాకు చెవులు సరిగ్గా వినిపించవు. శరీరం కూడా సహకరించదు. గత పది రోజులుగా మంచానికే పరిమితమయ్యా. సోమవారం పింఛను వస్తుందనుకుంటే వలంటీరు పిల్లోడు రాలేదు. సరే మంగళవారం ఇస్తాడులే అనుకుంటి. రాలేదు. ఏంది సంగతని తెలుసుకుంటే మా ముసలోళ్లకు..చంద్రబాబు నాయుడు అనే ముసలోడు చేసిన నిర్వాకం అని తెలిసింది. కాటికి కాళ్లు చాపిన మాపై ఎందుకు చంద్రబాబు నాయుడుకు ఇంత పగ. ఈ జగన్ బాబు సీఎం అయిన తర్వాత ఇప్పుడేదో ఇంటిపట్టునే ఉంటూ వలంటీర్ల పుణ్యమా అని రూ.3 వేలు పింఛను తీసుకుంటున్నాం. చంద్రబాబు మా ఊరు వాడు అని చెప్పుకునేందుకే సిగ్గుపడుతున్నా. ఈ ఎండలో సచివాలయం వద్దకు వెళ్లి పింఛను తీసుకోవాలంటే అవుతాదా ? మా ముసలోల్లను ఇంత ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు ఆ దేవుడు తగిన బుద్ధి చెప్తాడు.

- నాగమ్మ, కొటాల గ్రామం, చంద్రగిరి మండలం

కాటికి కాలుజాపిన మాపైనా పగ..!



నా వయసు 95 ఏళ్లు. ఇద్దరు మనుషులు పట్టుకుంటే కానీ లేవలేను. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల పింఛన్ ఇవ్వలేదు. సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్లేందుకు కాళ్లు సహకరించవు. నడవలేను. కళ్లు కూడా మసకపడ్డాయి. నన్ను తీసుకుని పోయేవారు లేరు. నా మనవడు జగన్ వలంటీర్లతో మాకు కరోనాలోనూ సాయం చేశాడు. చంద్రబాబుకు కాటికి కాలుజాపిన మాపై ఇంత పగ ఎందుకో అర్థం కాలేదు. ఆఫీసర్లు మా ఇంటికే వచ్చి ఓటు వేసుకుని పోతారని చెప్పారు. మరి పింఛన్ వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తే తప్పు ఏముంది చంద్రబాబు ? మరి ఇంత దారుణమా ! మా శాపాలు తప్పక తగులుతాయి.

- కే.సురోజమ్మ, సీఎస్‌ఆర్ కాలనీ, తిరుపతి

వారు దుర్మార్గులు..



నా వయస్సు 90 సంవత్సరాలు. ఇంటిలో ఒక్కదాన్నే ఉంటా. ప్రతి నెల ఒకటో తారీఖున అవ్వా పింఛన్ అంటూ వలంటీర్ ఇంటికి వచ్చి నిద్ర లేపి ఇచ్చేవాడు. ఈ నెల ఆ ఊసేలేదు. వలంటీర్‌ను అడిగితే అవ్వా చంద్రబాబు మేము పింఛన్ ఇవ్వకూడదని మాపైన ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినాడు.. అందుకు మేము ఇక రెండు నెలల పాటు పింఛన్ ఇవ్వమని చెప్పాడు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ లాంటి దుర్మార్గులు రాజ్యాన్ని పాలిస్తే ప్రజలు బతకరు. మాలాంటి ముసళ్లోలు ఒకటో తారీఖు కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుంటాం. అలాంటిది రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లి లైన్‌లో నిలబడితే ఈఎండకు ప్రాణాలు వదులు కోవాల్సిందే.

- సి.యల్లమ్మ, కొర్లగుంట, తిరుపతి

పండుటాకుల హాహాకారాలు



ఈ చిత్రంలో మంచంపై పడి ఉన్న వృద్ధురాలి పేరు సక్కూబాయమ్మ. వయస్సు 70 ఏళ్లు. రేణిగుంట మండలం వెదుళ్లచెరువు గ్రామం. ఆమెకు పక్షవాతం రావడంతో చాలాకాలంగా మంచానికే పరిమితమైంది. నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీరు ఇంటికొచ్చి ఆమె చేతికి పింఛను అందించేవాడు. ఆ పింఛను డబ్బులతో మందులు తెచ్చుకుని బతుకుబండి లాగుతోంది. అయితే ఈ నెల పింఛను కోసం 3వ తేదీ సచివాలయానికే రావాలని చెప్పడంతో ఆమె ఆందోళన పడుతోంది. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుత్తివారిపల్లి సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలంటే ఎలా వెళ్లాలో, ఎవరు తోడు వస్తారో దేవుడా..? అంటూ నిట్టూరుస్తోంది. ఓటు కూడా ఇంటికొచ్చి వేసుకుని పోతారంట.. పింఛను మాత్రం అంత దూరం వెళ్లి తెచ్చుకోవాలా అంటూ వాపోతోంది. ఇంత దుర్మార్గానికి ఒడిగట్టిన చంద్రబాబుకు మా ముసలోళ్ల ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

- సక్కూబాయమ్మ, వెదుళ్లచెరువు, రేణిగుంట మండలం.

ఆ నరకం భరించలేం...



టీడీపీ పాలనలో పింఛన్ ఇచ్చిన తీరు గుర్తు చేసుకుంటేనే భయంగా ఉంది. ఆ నరకం భరించలేం. ఎర్రటి ఎండలో 78 ఏళ్లు నిండిన మా లాంటి వృద్ధులు కిలో మీటరు పైగా ఉండే లైన్‌లో నిలబడగలమా ? మా వృద్ధులపైన చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు ఎందుకు ఇంత కసి. గత ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి గడప దగ్గరకు వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చాడు. కానీ ఈ నెల సచివాలయంలో ఇస్తారు అని చెప్పే సరికి భయమేస్తోంది. ఎండలు అగ్నిగుండంలా ఉన్నాయి. కదలలేని మాలాంటి ముసలివాళ్లు, షుగర్, బీపీ ఉండేవాళ్ల ఎలా వెళ్తారు. ఎన్నికల అధికారులు ఇంటికి వచ్చి ఓటు వేసుకుని పోతాం తాతా అంటున్నారు. మరి వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తే తప్పా ?

- పి సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, తిరుపతి

పింఛను కోసం వెళ్లేదెట్టా..?



పైఫొటోలో ఉన్న తండ్రీ కొడుకులు చీరాలయ్య, చంద్రయ్య. రేణిగుంట మండలం వెదుళ్లచెరువు దళితవాడ. 85ఏళ్ల పైబడిన చీరాలయ్య వయోభారంతో నడవలేడు. అతని కుమారుడు చంద్రయ్య రెండుకాళ్ల అవిటితనంతో నడవలేడు. వీరికి ఇన్నాళ్లూ ఇంటి వద్దనే ప్రతినెల ఒకటో వలంటీర్ వచ్చి పింఛను ఇచ్చేవాడు. ఇప్పుడు పక్క గ్రామంలోని సచివాలయానికి వెళ్లి పింఛను తెచ్చుకోవాలని తెలిసి భోరున విలపిస్తున్నారు. చంద్రబాబునాయుడుకి శాపనార్థాలు పెడుతున్నారు. ఇన్నాళ్లూ జగన్ పింఛను ఇంటికే పంపించాడు. ఇక మాకు దిక్కెవరయ్యా..! అంటూ దీనంగా రోదిస్తున్నారు. - చీరాలయ్య, చంద్రయ్య, వెదుళ్లచెరువు, రేణిగుంట మండలం.

వారేం బాగు పడతారు..



మాలాంటి వాళ్ల కోసం ఇంటికి వచ్చి ఇచ్చే పింఛన్‌ను అడ్డుకున్నారు. మాలాంటి ఎంతోమంది కడుపు మంట పోసుకుని వారేం బాగుపడుతారు..! 2018లో నా భర్త మరణించాడు. 2019లో వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పింఛను ఇస్తుంది. గతేడాది నాకు పక్షవాతం సోకి కాలు, చేయి పనిచేయకుండా పోయాయి. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాను. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే మా ఇంటి వద్దకు వచ్చి వలంటీరు పింఛను ఇచ్చేవాడు. ఆ డబ్బులతో అవసరమైన మందులు తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నాను. ఈ నెల ఇంకా వలంటీరు రాలేదు. అదేంటని అడిగితే మేమే సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలంటున్నారు. నేను సచివాలయానికి ఎలా వెళ్లేది. మమ్మల్ని ఇంత ఇబ్బంది పెట్టేందుకు వారికి మనసెలా వచ్చింది ?

- వి.పొట్టెమ్మ, వితంతురాలు, గోవర్ధనగిరి, పిచ్చాటూరు

మాలాంటి వాళ్లపైనా మీ ప్రతాపం..



కాటికి కాళ్లు చాపే మాలాంటి పైనా ప్రతిపక్ష పార్టీల వారు ప్రతాపం చూపేది. నాకు వెన్నెముక దెబ్బతింది. కనీసం లేచి నిలబడలేను. మంచానికే పరిమితమయ్యాను. నాకు గతేడాది నుంచి దివ్యాంగ పింఛను వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీరు ఇంటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. ఈ నెల ఇంకా రాలేదు. వాళ్లు ఇవ్వకూడదని చెప్పారట.. మేమే పంచాయతీ ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోవాలంట.. ఇలా మా కడుపులు కొట్టి రాజకీయాలు చేయడం టీడీపీ వారికి తగునా ?

- భాగ్యమ్మ, దివ్యాంగురాలు, చిన్నవీధి, పిచ్చాటూరు

సీఎంను కలిసిన హరిప్రసాద్


అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ ఇన్‌చార్జ్ హరిప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. -తంబళ్లపల్లె

వివాహేతర సంబంధంపై ప్రశ్నించినందుకు..


గాయపడిన ప్రసాద్

నాయుడుపేటటౌన్: తన భార్యతో ఎందుకు వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై కత్తితో గొంతు కోసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో సోమవారం రాత్రి వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాత బీడీ కాలనీకి చెందిన కనపర్తి ప్రసాద్‌కు అదే ప్రాంతానికి చెందిన సుమతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల కిందట గొడవ పడి విడిపోయారు. తరువాత ఆమె అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో తెలిపాడు. ప్రసాద్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న మజీద్, అదే ప్రాంతానికి చెందిన మౌలి సోమవారం బీడీ కాలనీ వద్ద ప్రసాద్‌తో గొడవ పడ్డారు. పథకం ప్రకారం వారు తెచ్చుకున్న కత్తితో ప్రసాద్ గొంతు కోశారు. స్థానికులు చూసే సరికి నిందితులు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన ప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే బాధిత కుటుంబ సభ్యులతో పాటు కాలనీవాసులు కొందరు ప్రసాద్‌ను చంపేందుకు యత్నించిన వ్యక్తులపై పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాలనీ వద్ద ఆందోళన చేపట్టారు.

రూ.42.58 లక్షలకు మహిళ ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతి కోటకొమ్మల వీధికి చెందిన సజ్జన్‌దేవి నహత తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.42,58,800లకు ఐపీ దాఖలు చేసినట్లు ఆమె తరఫు న్యాయవాది టీఎం పురుషోత్తం మంగళవారం మీడియాకు తెలిపారు. పిటీషన్‌లోని వివరాల మేరకు పిటీషనర్ సజ్జన్ దేవి నహతా తిరుపతిలో ప్రైవేట్ చిట్ వ్యాపారం నిర్వహించేవారు. చిట్టీ పాడిన వారు సొమ్ము తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో మిగిలిన చిట్టీ సభ్యులకు సొమ్ము చెల్లించే క్రమంలో ఇతరుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చింది. అలాగే ఖాళీ ప్రామిసరి నోట్లు, ఖాళీ చెక్కుల్లో ఆమె సంతకాలు చేసి రుణదాతలకు ఇచ్చారు. అయితే చిట్టీ సొమ్ము తీసుకున్న కొంతమంది ఊరు నుంచి పరారు కాగా, మిగిలిన కొంతమంది ఆమెకు తిరిగి చెల్లించలేదు. దీంతో ఆమె తీవ్రంగా నష్టపోయారు. రుణదాతలు అధిక వడ్డీలు చెల్లించాలని వేధిస్తుండడంతో 12 మంది రుణదాతలను ఆమె ప్రతివాదులుగా పిటీషన్‌లో పేర్కొంటూ ఐపీ పెట్టారు.

కన్నతల్లి అనే కనికరం లేకుండా..


రక్తపు మడుగులో రాజమ్మ మృతదేహం

పిచ్చాటూరు: పున్నామ నరకం నుంచి కాపాడేవాడే కొడుకు అని పెద్దలు చెప్పే మాట.. కానీ ఆస్తులు, డబ్బుల కోసం కన్న తల్లిదండ్రులనే చంపుతున్న సంఘటనలు ఈ మధ్య సమాజంలో వెలుగు చూస్తున్నాయి. తాజాగా ఆస్తి కోసం కన్నతల్లిని ఓ కొడుకు అతి కిరాతకంగా గొంతు కోసి చంపిన ఘటన పిచ్చాటూరు మండలంలో మంగళవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు గ్రామానికి చెందిన రాజమ్మ(80)కు మునస్వామి రెడ్డి, కృష్ణారెడ్డి ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్దకొడుకు మునస్వామి రెడ్డి గతంలోనే మరణించాడు. రాజమ్మ పేరిట ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఆ ఎకరం పొలాన్ని రాజమ్మ మరణించిన పెద్దకొడుకు మునస్వామి రెడ్డి కుమారుడు హరి రెడ్డి పేరిట రాసిచ్చింది. ఈ విషయమై ఆగ్రహించిన చిన్నకొడుకు కృష్ణారెడ్డి గత రెండు నెలలుగా తల్లితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మనవడు (మునస్వామి రెడ్డి కొడుకు) హరిరెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన చిన్నాన్న కృష్ణారెడ్డి, అతని కుమారులు ఇలంగోవన్, పురుషోత్తం ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణారెడ్డి తన కుమారులతో కలిసి ఇంటి వద్ద ఉన్న తల్లి రాజమ్మను అతి కిరాతకంగా గొంతు కోసి పరారయ్యారు. దీంతో వృద్ధురాలి అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడుకు తరలించారు. ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. హత్య చేసిన కృష్ణారెడ్డి, అతని కుమారులు ఇలంగోవన్, పురుషోత్తం పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశామని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. ట్రైనీ డీఎస్పీ సింధు సాయంత్రం పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కేసు వివరాలపై ఆరా తీశారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- ప్రజల ఆశీస్సులతో అభినయ్ గెలుపు ఖాయం
- తిరుపతి 47వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


అశేష జనవాహని నడుమ భూమన ఎన్నికల ప్రచారం


ప్రజలకు అభివాదం చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ప్రపంచ రాజకీయ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వైఎస్సార్‌సీపీని తిరిగి గెలిపిస్తాయని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి 47వ డివిజన్‌లో మంగళవారం కార్పొరేటర్ కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆయన మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు భూమన కరుణాకరరెడ్డికి అడుగడుగునా హారతులు పట్టి పూలవర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. గజమాలలతో సత్కరించారు.

పేదల జీవితాల్లో వెలుగులు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.3.45 లక్షల కోట్లను నేరుగా పేదప్రజల ఖాతాల్లోకి వేసిన ఘనత జగనన్నదే అని కొనియాడారు. రాష్ట్ర ప్రజలంతా జగనన్నను తిరిగి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో కల్లిబొల్లి మాటలతో మోసగించేందుకు వస్తున్న చంద్రబాబుకు ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలను రాష్ట్ర ప్రజలు మడతపెట్టి మూలన పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న సహకారంతో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా రూ.1700 కోట్లతో తిరుపతిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత భూమన అభినయ్‌కే దక్కుతుందన్నారు. తిరుపతిలో అభినయ్ నిర్మించిన 22మాస్టర్‌ప్లాన్ రోడ్లు తిరుపతి ప్రజలతో పాటు శ్రీవారి భక్తులకు స్వర్గధామంగా మారాయన్నారు. 22ఏ రద్దుతో 8వేల కుటుంబాల్లో వెలుగులు నింపామని గుర్తు చేశారు. తిరుపతిలో జరిగిన ప్రతి అభివృద్ధిని నగర ప్రజలు కళ్లారా చూశారని, తిరుపతి ప్రజల ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో అభినయ్‌రెడ్డి భారీ విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొరైరాజ్, మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తిరుపతి మునిరామిరెడ్డి, ఆరణి సంధ్య, దూది కుమారి, నేతలు సురేంద్రరెడ్డి, మధుసూధన్‌నాయుడు, ఎఆర్.వెంకటేష్, మునిశేఖర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మురళి పందలూరి ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, కోటి, రమణ, బియ్యం సుబ్రమణ్యం, చిరంజీవి, గఫూర్, పెరుగుబాబూయాదవ్, ఆర్‌వీ మగి మొదిలియార్, పుష్పాచౌదరి, రమణమ్మ, శారద, గీతాయాదవ్, ప్రమీల పాల్గొన్నారు.